పొంచి ఉన్న నీటి ముప్పు

- పెరుగుతున్న ఎండలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- మేల్కోకపోతే సమస్య


కామనూరు సమీపంలో ఉన్న కుందూ నదిలో తగ్గిన నీటి ప్రవాహం

ప్రొద్దుటూరు రూరల్ : మండుటెండల ప్రభావం అధికంగా ఉండటంతో.. గ్రామాల్లో తాగునీటి సమస్య పొంచి ఉంది. ప్రొద్దుటూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సమస్య తీవ్రతను గుర్తించిన అధికారులు వేసవి నుంచి గట్టెక్కేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. వాస్తవానికి మండల పరిధిలో పెన్నా, కుందూ నదులు విస్తారంగా ఉన్నాయి. అనేక గ్రామాలకు ఈ నదుల నుంచే సాగు, తాగు నీరు అందుతోంది. ఎండల ప్రభావం కారణంగా ప్రస్తుతం రెండు నదుల్లో నీటి మట్టం అడుగంటింది. తద్వారా బోర్లలో నీటి మట్టం తగ్గి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మండలంలోని అమృతానగర్, చెన్నమరాజుపల్లె, నాగాయపల్లె, కామనూరు, నక్కలదిన్నె గ్రామాల్లో తాగునీటి సమస్య రావచ్చునని, ఈ గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉంటుందని సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. మండలంలో 48 బోర్లు, 185 చేతి పంపులు ఉన్నప్పటికీ.. భూగర్భ జలాలు అడుగంటడంతో వీటిలో కూడా అరకొరగానే నీరు సరఫరా అవుతోంది.

పైపులైన్ లీకేజీతో కలుషిత నీరు

ప్రొద్దుటూరు మండలంలో 36 వేల కుటుంబాలకు సంబంధించి లక్షా 45 వేల మంది జనాభా ఉన్నారు. వీరికి కుందూ, పెన్నా నదుల నుంచి కాకుండా చెన్నమరాజుపల్లె చెరువు, దొరసానిపల్లె సమీపం నుంచి బోర్ల ద్వారా తాగునీరు అందుతోంది. కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని కొన్ని చోట్ల, నంగనూరుపల్లె గ్రామంలో పైపులైన్ లీకేజీ అవుతున్నాయి. ఈ పైపులైన్ లీకేజీ అవడం వల్ల మురికి నీరు వస్తోందని, ఆ నీరు తాగలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు.

ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నా..

చాలా గ్రామాల్లో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి తప్ప వాటిలోకి నీరు ఎక్కించడం లేదు. దీని ద్వారా విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే ప్రజలకు తాగునీరు అందుతోంది. విద్యుత్ సరఫరా లేకపోతే ప్రత్యామ్నాయంగా నీరు అందే పరిస్థితి లేదు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌లు క్లీనింగ్ చేయలేకపోవడం, లేక ఇతర కారణమో తెలియదు కానీ తాగునీటిని నేరుగా కుళాయిల ద్వారా అందిస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా కుందూ, పెన్నా నదుల్లో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. దీని ప్రభావం బోర్లపై పడిందన్నారు. పైపులైన్ లీకేజీలు ఉన్నా, తాగునీటి సమస్య ఉన్నా వాట్సాప్ ద్వారా సమాచారం ఇస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

కలుషిత నీరు వస్తోంది



తాగునీటి కుళాయిలో కలుసిత నీరు వస్తోంది. ఈ నీరు తాగడానికి కాకుండా కనీసం వంట పాత్రలు కడగడానికి కూడా పనికిరావడం లేదు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు చెప్పినా ప్రయోజనం లేదు.

– కుమారి, నంగనూరుపల్లె, ప్రొద్దుటూరు మండలం

మినరల్ వాటర్ కొనలేకున్నాం



కుళాయిల ద్వారా మంచి నీరు రాకపోవడంతో మినరల్ వాటర్ కొనలేకున్నాం. ఎక్కడో పైపులైన్ లీకేజీ కావడం వల్ల మురుగు నీరు పైపుల గుండా వస్తోంది. దీనిని అధికారులు సరి చేసి తాగునీటిని ప్రజలకు అందించాలి.

– చాపాటి పెద్దక్క, నంగనూరుపల్లె, ప్రొద్దుటూరు మండలం


కొత్తపల్లె పంచాయతీలో వినియోగంలో లేని వాటర్ ట్యాంక్

వేసవి వస్తే.. ఆ గ్రామాల్లో..


చియ్యపాడులో ట్యాంకర్ల నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు (ఫైల్)

చాపాడు : వేసవి కాలం వచ్చిందంటే చాలు మండలంలోని చియ్యపాడు, అన్నవరం గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తనుంది. ఈ ఏడాది మార్చి ఆరంభం నుంచే భారీగా ఎండలు కాస్తుండటంతో.. మంచినీటి సమస్యలు తలెత్త అవకాశాలు ఉన్నట్లు స్థానిక ప్రజలు భావిస్తున్నారు. గతేడాది ఈ గ్రామాలలో ఫిబ్రవరి నెల నుంచే తాగునీటి సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వ అధికారులు సర్పంచ్‌ల ద్వారా ఆయా గ్రామాల్లో ట్యాంకర్లను ఏర్పాటు చేసి మంచి నీటిని అందించారు. ఈ ఏడాది కూడా ఈ గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది మంచినీటి సమస్యలు తలెత్తకముందే నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉపాధి పనులు ఇప్పుడే వద్దు'

రాజుపాళెం : ఉపాధి హామీ పనులు ఇప్పుడే వద్దని రాజుపాళెం గ్రామ రైతులు పేర్కొన్నారు. రాజుపాళెంలోని మండల కార్యాలయ ఆవరణలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం కూలీలతో పత్తిపంటలో పత్తి తీయడం, నూగు పంట కోయడం, మిరప కాయలు, మొక్కజొన్న కంకులు కోయడం, పసుపు కొమ్ములు తవ్వడం వంటి పనులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా మిగతా పంటలు కోత దశలో ఉన్నాయని చెప్పారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు గ్రామాల్లో వ్యవసాయ పనులు ఉన్నాయని, అధికారులు స్పందించి ఉపాధి పనులు ఈ నెల ఆఖరు వరకు పెట్టవద్దని సూచించారు. అనంతరం ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, ఏపీఓ లక్ష్మి నారాయణకు వినతి పత్రం ఇచ్చారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

అట్లూరు : రైతులు సాగు చేసిన ప్రతి పంటకు ఈ-పంట నమోదు తప్పనిసరి అని బద్వేలు డివిజన్ వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండలం తిప్పనపల్లి రైతు సేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసిన జాబితా రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సందీప్, పవన్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనపై కళాజాత

మైదుకూరు : మైదుకూరు మండలం గంజికుంట సుగాలి తాండాలో సోమవారం నాటు సారా నిర్మూలనపై పోలీసు కళాజాత బృందం అవగాహన కల్పించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న నవోదయం 2.0లో భాగంగా నాటుసారా వినియోగంతో జరిగే అనర్థాలపై కళాజాత బృందం ప్రదర్శనలు నిర్వహించింది. కార్యక్రమంలో మైదుకూరు అర్బన్ సీఐ హాసం, ఎక్సైజ్ సీఐ ధీరజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శేషవాహనంపై శ్రీనివాసుడు


ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి విష్వక్సేన పూజ, మూలవరులకు రక్షాబంధనము, గరుడ ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి స్వామి వారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయ కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ రామలింగారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, శ్రావణ్, ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

అట్లూరు : మల్లు సుబ్బారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్య పడవద్దని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధ భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని తంబళ్లగొంది మాజీ సర్పంచ్ మల్లు సుబ్బారెడ్డి (70) బ్రెయిన్ స్ట్రోక్‌తో తిరుపతిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ సోమవారం తంబళ్లగొంది వెళ్లి మల్లు సుబ్బారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి శింగమల వెంకటేశ్వర్లు, బద్వేలు మున్సిపాలిటీ కన్వీనర్ సుందర్‌రామిరెడ్డి,, మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, అందూరు రామకృష్ణారెడ్డి, ముడమాల బాలమునిరెడ్డి, తంబళ్లగొంది ఎంపీటీసీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు : ఎన్జీఓల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు రఘురామిరెడ్డి, రామసుబ్బయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎన్జీఓ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దివంగత ఆమనిగంటి శ్రీరాములు 104వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు.

చిరస్మరణీయుడు శ్రీరాములు

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగులకు సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిన ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ఆమనగంటి శ్రీరాములు ఉద్యోగుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ బద్వేలు తాలూకా సెక్రటరీ టి.నరసింహారెడ్డి, ట్రెజరర్ వి.శివరామిరెడ్డిలు పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

బద్వేలు అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవీ భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు రాజకీయంగా, సైద్ధాంతికంగా అవగాహన కలిగి ఉండాలని, లేనిపక్షంలో మతోన్మాదులను ఎదిరించలేమని అన్నారు. కేంద్రంలో మతోన్మాద నియంతృత్వ పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం మద్దతుగా, అండగా నిలవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పి.చంద్రశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, ఏరియా కార్యవర్గ సభ్యులు బాలు, ఇమ్మానియేల్, పెంచలయ్య, నాగేష్, విజయమ్మ, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంచుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు నిర్వాహకులు శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివ మహాపురాణంపై ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. శివమహాపురాణంలోని పలు అంశాలను, మహాశివుని గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. ఈనెల 15వ తేదీ వరకు రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి 7.45 గంటల వరకు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రవీంద్ర హైస్కూల్ వ్యవస్థాపకుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ కమిటీ చైర్మన్ మార్తల రాజారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మహిళా లోకానికే ఆదర్శం సావిత్రిబాయి పూలే


ప్రొద్దుటూరు క్రైం : మాట్లాడుతున్న చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ


బద్వేలు అర్బన్ : సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : మహిళా లోకానికే ఆదర్శం సావిత్రిబాయి పూలే అని యోగివేమన యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు, మహనీయుల ఆశయ సాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తిలు పేర్కొన్నారు. సావిత్రిబాయి 128వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక సిద్ధవటం రోడ్డులోని సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బద్వేలు పట్టణాభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీనివాసులరెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుభాన్‌బీ, పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

■ డీవైఎఫ్ఐ కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, బాలగురయ్య, మహిళా కో కన్వీనర్ నాగేశ్వరి, మహిళా సంఘం అధ్యక్షురాలు అనంతమ్మ పాల్గొన్నారు.

ఆదర్శనీయురాలు సావిత్రిబాయి పూలే

ప్రొద్దుటూరు : ఆదర్శనీయురాలు సావిత్రిబాయి పూలే అని రాయలసీమ మహిళా శక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి తెలిపారు. సోమవారం పట్టణంలోని తమ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సృజన శ్రీను, రాయలసీమ మహిళా శక్తి నాయకులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే మహిళలకు హక్కులు

ప్రొద్దుటూరు క్రైం : చైతన్యంతోనే మహిళలు తమ హక్కులను సాధించుకోవచ్చని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక హనుమాన్ నగర్‌లో చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, ప్రముఖ డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది మెహతాబ్, మెప్మా సీఓలు విమల, రసూలమ్మ, శ్రీదేవి, ఆర్పీల సంఘం పట్టణ అధ్యక్షురాలు తనికంటి లక్ష్మీదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు చంద్రావతి పాల్గొన్నారు.

పెన్నా నుంచి ఇసుక రవాణా వద్దని తీర్మానం


తీర్మానాన్ని ఆమోదిస్తున్న కల్లూరు గ్రామస్తులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కల్లూరు గ్రామ సచివాలయంలో సోమవారం సాయంత్రం సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో పెన్నా నుంచి ఇసుక రవాణాను అరికట్టేందుకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కల్లూరు గ్రామ పంచాయతీ పెన్నానది ఒడ్డున ఉండటం వల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చారన్నారు. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ల వల్ల నది నుంచి గ్రామానికి వచ్చే తాగునీటి పైపులైన్లు దెబ్బతింటున్నాయన్నారు. తాగునీటి పైపులైన్లు శ్మశాన వాటిక పక్కనే ఉన్న పొలాల నుంచి మార్చేందుకు, ఇసుక తోలకాన్ని ఆపేయడం కోసం తీర్మానం చేశామన్నారు. ఇందుకోసం ప్రజాభిప్రాయ సేకరణ చేశామని, ప్రజలు ఈ రెండు తీర్మానాలను ఆమోదించారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు వల్లూరు నాగేంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్ పాల్గొన్నారు.

మార్చి 31 వరకు కేసీ కెనాల్‌కు సాగునీరివ్వాలి

చాపాడు : ఈ నెల చివరి వరకూ కేసీ కెనాల్ ద్వారా ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని కోరుతూ కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మేజర్ ప్రాజెక్ట్ చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి కేసీ కెనాల్ నంద్యాల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు సోమవారం లేఖ రాశారు. జిల్లాలోని కేసీ కెనాల్‌కు నీరు అవసరం మేరకు అందకపోవడంతో మినుము, పసుపు, వరి, మిరప, వరి, పెసర వంటి పంటలకు కోత దశలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. చాపాడు, ఏటూరు, కొండపేట కాలువలతో పాటు కేసీ కెనాల్ ప్రధాన కాలువ పరిధిలోని రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారన్నారని లేఖలోపేర్కొన్నారు.

బాలుడి హత్య కేసులో సీఐడీ విచారణ

రాజుపాళెం : 2021లో హత్యకు గురైన బాలుడి కేసు విషయంలో నిందితుల్ని తప్పించారన్న దానిపై విజయవాడ సీఐడీ ఎస్పీ చక్రవర్తి బృందం సోమవారం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే... రాజుపాళెం మండలంలోని వెంగలాయపల్లె గ్రామానికి చెందిన గుద్దేటి తనీష్ రెడ్డి (9) అనే బాలుడు హత్యకు సంబంధించి 2021లో అప్పటి పోలీసు ఉన్నతాధికారులు కేసు నమోదు చేశారు. ముందుగా బాలుడి మిస్సింగ్ కేసు నమోదు చేసి ఆతర్వాత ఇది హత్యేనని అదే గ్రామానికి చెందిన సైదుగాల్ల పెద్ద దస్తగిరిపై కేసు నమోదు చేశారు. తమ కుమారుడి హత్య కేసులో నిందితులు ఒకరు కాదని ముగ్గురు ఉన్నారని సీఐడీ అధికారులకు బాధితులు ఫిర్యాదు చేయడంతో సీఐడీ ఎస్పీ స్వయంగా రాజుపాళెం మండలంలోని వెంగలాయపల్లె గ్రామానికి చేరుకొని హత్య జరిగిన సంఘటన స్థలాన్ని, చుట్టుపక్కల వారిని విచారించారు. హత్యకు గురైన బాలుడి తల్లిదండ్రులైన శోభారాణి, సంజీవరెడ్డిలను హత్యకు గల వివరాలను సీఐడీ ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అయితే విచారణ వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విచారణలో ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, సీఐడీ బృందం డీఎస్పీ రసూల్ సాహెబ్, సీఐ రంగస్వామి, ఎస్ఐ సుబ్బరాజు, ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ వెంకట రమణ, పోలీసులు పాల్గొన్నారు.

'యథేచ్ఛగా మురుగు కాలువల ఆక్రమణ'


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజాపక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో యథేచ్ఛగా మురుగు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. ఆయన ప్రజాపక్షం పార్టీ నాయకులతో కలిసి సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టూటౌన్ బైపాస్ రోడ్డు నుంచి కొత్తపల్లె పంచాయతీలో కలిసే రెండు కాలువలు కబ్జాకు గురయ్యాయన్నారు. సర్వే నంబర్ 568లో మోడంమీదపల్లె ఆంజనేయస్వామి దేవాలయం మీదుగా మురుగు కాలువ ఉందన్నారు. సర్వే నంబర్ 118లోని మురికి కాలువ ఎఫ్‌జీ ఫంక్షన్ హాల్ వరకు 2.10 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. ఈ ఏరియాలో సెంటు స్థలం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు పలుకుతోందన్నారు. అనేక మంది కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శివరామిరెడ్డి, ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న అంగన్వాడీ వర్కర్లు

బద్వేలు అర్బన్ : అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు కె.సుభాషిణి పేర్కొన్నారు. విజయవాడలో తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విచ్ఛిన్నం చేయడానికి అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఓబులేసు, పట్టణ నాయకులు మస్తాన్‌షరీఫ్, ఓబుల్‌రెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హుస్సేనమ్మ, ప్రాజెక్టు నాయకురాళ్ళు కళావతి, జయప్రద, కె.వి.సుభాషిణి, విజయమ్మ, వాణి, భారతి, సుధ, ప్రభావతి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

చాపాడు : ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. తొమ్మి నెలలవుతున్నా తమ సమస్యలు పరిష్కరించకుండా కాలయాప చేస్తోందని సోమవారం అంగన్వాడీ వర్కర్లు ఆందోళన చేపట్టారు. మండల కేంద్రమైన చాపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు, తహసీల్దారు కార్యాలయాల ఎదుట అంగన్వాడీ వర్కర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్లు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పుడు అప్పటి ప్రతిపక్ష పార్టీ నేత చంద్రబాబు తమకు అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలు అమలుపరిచే వరకూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు రమాకుమారికి వినతి పత్రం అందజేశారు.

మహాధర్నా భగ్నంపై నిరసన

మైదుకూరు : అంగన్‌వాడీ సమస్యలపై విజయవాడలో శాంతియుతంగా తలపెట్టిన మహాధర్నాని భగ్నం చేయడంపై సోమవారం మైదుకూరులో ఏఐటీయూసీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంగన్‌వాడీలను ప్రభుత్వం పోలీసులతో అరెస్ట్ చేయించడాన్ని నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏపీ శివరామ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చెన్నమ్మ బి.పీరయ్య, ఎస్.షావలి, యూనియన్ నాయకులు ఎస్‌కే రిజ్వానా కౌసర్, నియాజున్, అన్నపూర్ణ, చంద్రకళ, వెంకటలక్ష్మి, శారద, చంద్రిక, కృష్ణవేణి, లక్ష్మీదేవి, రజియా, ఈశ్వరమ్మ, జయశ్రీ పాల్గొన్నారు.

మోసం.. చంద్రబాబు నైజం

'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు


యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా విద్యార్థులకు, యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వారిని మోసగించిన నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యువతకు అండగా ఈ నెల 12న నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో టీడీపీ కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని అన్నారు. విద్యార్థులు, యువతకు అండగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత తరలిరావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర కార్యదర్శి యద్దారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బి.రామసుబ్బారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆయా మండలాల అధ్యక్షులు మల్లేశ్వర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, మున్సిపాలిటీ, ఆయా మండలాల ముఖ్య నేతలు కేశవరెడ్డి, నాగంసుబ్బారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యువత పోరును జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన పార్టీ నాయకులతో కలిసి సోమవారం యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత పోరులో విద్యార్థులు, నిరుద్యోగులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగులు కార్యక్రమానికి వెళ్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఆయన గాలికి వదిలేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు ఈ పథకాన్ని అమలు చేయలేదన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లలో ఒక సిలిండర్ మాత్రమే ఇప్పటి వరకు ఇచ్చారని, పెద్ద మొత్తంలో లబ్ధిదారులకు ఈ డబ్బు జమ కాలేదన్నారు. తల్లికి వందనం గత ఏడాది అమలు చేయలేదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకానికి సంబంధించి రూ.12 వేల కోట్లు బడ్జెట్ అవసరం కాగా రూ.9 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు తగ్గిపోయిందన్నారు. ఉచిత బస్సు పథకం అమలు కాలేదని పేర్కొన్నారు. ఉద్యోగులకు సంబంధించి వేతనాలు సక్రమంగా అందడం లేదని, బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. ఐఆర్, డీఏ బకాయిల ఊసే లేదన్నారు. నాడు-నేడు మన బడి పథకాన్ని ఎత్తేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుకు నోచుకోలేదని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని, రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ రాజారాంరెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ అక్బర్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ద్వార్శల గురునాథరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు ఖాజాపీర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, ఎంపీటీసీ గోపాల్, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, నాయకులు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల జీవితాలు అంధకారం

మైదుకూరు : కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయక వేలాది మంది విద్యార్థుల జీవితాలు అంధకారంలో పోడిపోయాయని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆరోపించారు. ఈనెల 12వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమ పోస్టర్లను సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్ల ఎలాంటి అంతరాయం లేకుండా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు అయిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించలేదని విమర్శించారు. ఫీజులు చెల్లించకపోతే కళాశాల యాజమాన్యాలు విద్యార్థులతో పరీక్షలు రాయించరని.. అదే జరిగితే వారి భవిష్యత్తు నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 2004కు ముందు ఎక్కడ ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2004లో దేశంలోనే తొలిసారిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేశారని గుర్తు చేశారు. దాని వల్ల వేలాది మంది పేద విద్యార్థులు విదేశాల్లోనూ చదువుకొని ఇంజనీర్లు, వైద్యులు అయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నేట్లపల్లె శివరాం, గల్లా నరసింహారెడ్డి, దువ్వూరు ఎంపీపీ జయచంద్రారెడ్డి, మూలె సుధాకర్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, దువ్వూరు మండల కన్వీనర్ శంకర్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా నాయకుడు నాగేశ్వరరెడ్డి, మండల కోఆప్షన్ ఇంతియాజ్ ఖాన్, ముడమాల వేణుగోపాల్ రెడ్డి, ఎం.నరసింహారెడ్డి, చిన్న వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.